## క్లుప్తంగా

### ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న దామోదర రాజనర్సింహా

పుల్‌కల్(అందోల్): ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. పుల్‌కల్‌లో మంగళవారం నిర్వహించిన నల్ల పోచమ్మ ఆలయ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

### అకాల వర్షంతో కాలనీలు జలమయం



జేసీబీ సాయంతో నీటిని తొలగిస్తున్న దృశ్యం

నారాయణఖేడ్: డివిజన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. సిర్గాపూర్ మండలంలో 44.2 మిల్లీమీటర్లు, ఖేడ్‌లో 35.8, కంగ్టిలో 32.8, మనూరులో 29.4, నాగల్‌గిద్దలో 24.2, కల్హేర్‌లో 12.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. గంటన్నర పాటు కురిసిన భారీ వర్షానికి నారాయణఖేడ్ పట్టణంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, శానిటరీ అధికారి శ్రీనివాస్ స్పందించి నీటిని తొలగించడానికి చర్యలు తీసుకున్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



బోనాలు సమర్పిస్తున్న భక్తులు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని చిమ్నాపూర్‌లో పోచమ్మ ఆలయ 5వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఆత్మకమిటీ చైర్మన్ కష్ణగౌడ్, ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఈదులనాగులపల్లిలో రోడ్డు పంచాయితీ



మాట్లాడుతున్న కౌన్సిలర్ రాజు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లిలో మంగళవారం గ్రామం నుంచి శ్మశానవాటిక వరకు మున్సిపల్ అధికారులు సీసీ రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. కాగా తన భూమిలో నుంచి రోడ్డు ఏలా వేస్తారు అంటూ ఓవ్యక్తి తన అనుచరులతో కలసి రోడ్డు పనులను అడ్డుకున్నారు. దాంతో స్థానిక కౌన్సిలర్ శంషాబాద్ రాజు గ్రామస్తులు అక్కడికి చేరుకొని రోడ్డు పనులను ఏలా అడ్డుకుంటారని నీలదీశారు. ఈ విషయం తెలుసుకున్న బీడీఎల్ పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ఈమార్గం నుంచి రాకపోకలు సాగిస్తున్నామని, గతంలో సైతం కంకర రోడ్డును వేశామని గుర్తు చేశారు. మున్సిపల్‌లో తీర్మానం చేసి సీసీ రోడ్డును వేస్తుంటే అడ్డుకోవడం సరికాదన్నారు.

### నేడు జాబ్‌మేళా

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రసాయనశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాన్విటా బయో టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌లో పని చేసేందుకు బీఎస్సీ, ఎంఎస్సీ మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, రసాయన శాస్త్రం ప్రధాన సబెక్టులు చదివిన విద్యార్థులు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. తారా కళాశాలలో 2021, 22, 23లో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ప్రొడక్షన్ క్వాలిటీ అసురెన్స్‌గా పని చేసేందుకు ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నారు. అభ్యర్థులు పూర్తి బయోడేటాతో పాటు పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, ఒరిజినల్ సర్టిఫికెట్‌లు, ఒక జిరాక్స్ సెట్‌తో తారా కళాశాలలోని సెమినార్ హాల్లో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9490932161, 9490017911ను సంప్రదించాలన్నారు.

# త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, మండల పరిషత్, నీటిపారుదల శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించే నిధులతో పాటు సీఎస్ఆర్ నిధుల ద్వారా అనేక అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. చివరి దశలో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు.సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సీసీ కెమెరాలతో భద్రత**

భద్రతను పెంచడంలో కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఎంతో ఉపకరిస్తాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు మాధవపురి, హిల్స్‌కాలనీ, ఆర్టీసీకాలనీ, జనప్రియనగర్ కాలనీలలో ఏర్పాటు చేసిన 100 కమ్యూనిటీ సీసీ కెమెరాలను సోమవారం రాత్రి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, దాతలు, స్థానిక కౌన్సిలర్ మహదేవరెడ్డిలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, డీఎస్పీ భీమ్‌రెడ్డి, సీఐ శ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాలనీ సంక్షేమ ప్రతినిధులు పాల్గొన్నారు.

**సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన**

పటాన్‌చెరు టౌన్: ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో రూ.49 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బీఆర్ఎస్ బండ్లగూడ అధ్యక్షుడు గోపాల్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్

ఎమ్మెల్యే క్రాంతికిరణ్



జోగిపేట: అన్నాసాగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మండల పరిధిలోని అన్నాసాగర్, కన్‌సాన్‌పల్లి, మాసానిపల్లి, సాయిబాన్‌పేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన చెందకూడదన్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి చైర్మన్ వర్కల అశోక్, మాజీ ఏఎంసీ చైర్మన్ నారాయణ, వ్యవసాయశాఖ ఏడీఏ అరుణ, ఏఓ విజయరత్న, ఏకేపీ ఏపీఎ మాణిక్యం పాల్గొన్నారు.

**ఆలయాల పునర్నిర్మాణం అభినందనీయం**

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని ఖాదిరాబాద్ గ్రామంలో రుక్మిణీ విఠలేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ ఉత్సవాల్లో ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులంతా కలిసికట్టుగా ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. అంతకుముందు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండల పరిధిలోని గట్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో డీసీసీబీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్, డైరెక్టర్ బుద్దిరెడ్డి, మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ జోగినాథ్, వరము చైర్మన్ వీరారెడ్డి, సర్పంచ్ ఖయ్యుం తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి అడ్‌హక్ నూతన కమిటీ నియామకం



నూతన కమిటీతో పద్మశాలి సంఘం నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డిలో పద్మశాలి సంఘం అధ్యక్షులు మాకం మల్లేశం అధ్యక్షతన మంగళవారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంగారెడ్డి పట్టణ పద్మశాలి సంఘం అడ్‌హాక్ కమిటీని నియమించారు. అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా సోమ రమేష్, కో-కన్వీనర్లుగా బోనకుర్తి శ్రీకాంత్, సంగారపు రాజేంద్రప్రసాద్, ఏలూరి స్వప్న, సౌజన్యలు నియామకమయ్యారు.అదేవిధంగా సంగారెడ్డి మండల పద్మశాలి సంఘం అధ్యక్షులుగా నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్, వట్‌పల్లి మండల పద్మశాలి సంఘం కన్వీనర్‌గా మండల విద్యాసాగర్, సదాశివపేట మండల కన్వీనర్‌గా సోలాపురం లక్ష్మణ రాజు నియామకమయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పెరి వెంకట హరిహరకిషన్, కోశాధికారి పోల పుండరీకం, మహిళా అధ్యక్షురాలు భోగ విజయలక్ష్మి, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, మహిళా ప్రధాన కార్యదర్శి రావులపల్లి రామలక్ష్మి, జిల్లా ముఖ్య సలహాదారు గౌంట్యాల పండరి, ఉపాధ్యక్షులు, సహ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న ప్రకాష్‌రావు

కొండాపూర్(సంగారెడ్డి): ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రకాష్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డిలో సీపీఐ ఇంటింటి ప్రజా చైతన్యయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు, 2022నాటికి ప్రతిఒక్కరికీ ఇండ్లు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంల బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్‌లు అందరికీ అందే పరిస్థితి లేదని, నిరుపేదలందరికీ 100 గజాల స్థలం ఇచ్చి రూ.5లక్షల ఇంటి రుణం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జలాలుద్దీన్ జిల్లా కార్యవర్గ సభ్యులు తాజుద్దీన్, ఎంఏ రెహమాన్, మహబూబ్‌ఖాన్, సునీత, సీనియర్ నాయకులు పన్యాల వజీర్‌బేగ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ముస్తఫా, గంగయ్య, అనురాధ, లక్ష్మి, మహేష్, మోహన్, వరలక్ష్మి, పోచమ్మ, నిర్మల, పద్మ, సువర్ణ పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగానికి పెద్దపీట



జహీరాబాద్ టౌన్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. ఇప్పెపల్లి సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్ కమిటీ యార్డులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటాలు మొక్కజొన్నకు రూ.1962 ధర నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ శివకుమార్, మైనార్టీ కమిషన్ సభ్యుడు తన్వీర్, సొసైటీ చైర్మన్ దాసరి మచ్చేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మోహినోద్దీన్, సర్పంచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఆయుర్వేద వైద్య కేంద్రం ప్రారంభం**

జహీరాబాద్: ఆయుర్వేద వైద్యానికి గొప్ప చరిత్ర ఉందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మంగళవారం జహీరాబాద్‌లోని పస్తాపూర్ క్రాస్ రోడ్డు వద్ద పిట్లం పురాతన ఆయుర్వేద వైద్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా పిట్లంకు చెందిన ఆయుర్వేద వైద్యం నిపుణులు జహీరాబాద్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఎఫ్ కార్మిక సంఘం అధ్యక్షుడు రాములు, మాజీ సర్పంచ్ నర్సింహులు, కేంద్రం నిర్వాహకులు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు మొయిజొద్దీన్, సత్యం పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

కంది(సంగారెడ్డి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన వరిధాన్యంను ప్రభుత్వం చివరివరకు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు తమ ధాన్యంను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వసంత్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, ఎంపీపీ సరళా పుల్లారెడ్డి, జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు చైల్వేరి ప్రభాకర్, కంది సర్పంచ్ విమలావీరేశం, ఏవో చైతన్య, పీఏసీఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

### భవానీమాతకు బోనాలు

ఝరాసంగం (జహీరాబాద్): మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామంలో మంగళవారం గ్రామంలోని భవానిమాత ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

### కొనసాగుతున్న ఓపెన్ పరీక్షలు

కొండాపూర్(సంగారెడ్డి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పరీక్షలలో భాగంగా మంగళవారం ఉదయం పదవ తరగతి అభ్యాసకులకు సాంఘీక శాస్త్రం, ఇంటర్మీడియట్ అభ్యాసకులకు జీవశాస్త్రం, అర్థశాస్త్రం పరీక్షలు నిర్వహించారు. పదవ తరగతి పరీక్షకు 2006 మంది అభ్యాసకులకు 1802 మంది హాజరుకాగా 207 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 2855 మంది అభ్యాసకులకు 2598 మంది హాజరుకాగా 257 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పదవ తరగతి అభ్యాసకులకు ఒకేషనల్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా ఒక విద్యార్థికి ఒక విద్యార్థి హాజరయ్యాడు.

### ఆధార్ నమోదుకు అవస్థలు

కల్హేర్(నారాయణఖేడ్): కొత్తగా ఆధార్‌కార్డు నమోదు చేసుకునేందుకు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్హేర్ మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసినా 5 ఏళ్లుగా సేవలు అందడంలేదని కలెక్టర్ శరత్‌కు ఫిర్యాదు చేయగా మంగళవారం ఆర్‌ఐ ప్రమోద్ ఆధార్ నమోదు కేంద్రాన్ని తనిఖీ చేసి ఆధార్ సేవలు అందడంలేదని గుర్తించారు. ఈ మేరకు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తహసీల్దార్ నాగేశ్వర్‌రావు తెలిపారు.

# జేపీఎస్‌లను క్రమబద్ధీకరించాలి



ఝరాసంగం: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జీపీఎస్‌లు



నారాయణఖేడ్‌లో..



జహీరాబాద్ టౌన్‌లో..

నారాయణఖేడ్: జూనియర్ పంచాతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సాతిని చిరంజీవి, కేవీపీఎస్ మండల కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. నారాయణఖేడ్ మండల పరిషత్తు కార్యాలయం ఎదుట చేపట్టిన జేపీఎస్‌ల నిరవధిక సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు.

**సమ్మెకు మద్దతు**

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మెకు మంగళవారం నవభారత్ నిర్మాణ యోజన జిల్లా అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి వెంటనే జేపీఎస్‌లను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బాబురాజుగౌడ్, పంచాయతీ కార్యదర్శులు నవోదరెడ్డి, రామకృష్ణ, నీలిమ, భవాని, మౌనిక, సిద్ధమ్మ పాల్గొన్నారు.

**కొనసాగుతున్న సమ్మె**

కల్హేర్(నారాయణఖేడ్): సమస్యలు పరిష్కరించాలని కల్హేర్ మండల పరిషత్తు కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. కార్యక్రమంలో జేపీఎస్‌లు విక్రమ్, పవన్, బాలరాజు, నాందేవ్, బీరప్ప, రవీందర్‌రెడ్డి, రజిత, సుమ పాల్గొన్నారు.

**అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం**

కోహీర్(జహీరాబాద్): ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. అంతకు ముందు కోహీర్ ఎంపీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం నుంచి చౌకి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.

**జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి**

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రమైన మొగుడంపల్లిలో సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మద్దతుగా టీజేఎస్ ఇన్‌చార్జి అప్ప సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి వెంటనే పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేసి ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శులు, టీజేఎస్ నాయకులు పాల్గొన్నారు.

**పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతు..**

మునిపల్లి(అందోల్): ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు పెద్దగోపులారం ఎంపీటీసీ బుర్కల పాండు మద్దతు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు లింగన్నగారి సతీష్ కుమార్, మాజీ ఎంపీటీసీ మంతూర్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంగమేశ్వర్, గుడ్డు పటేల్, రాజు పంతులు పాల్గొన్నారు.

**జేపీఎస్‌ల నిరసన**

ఝరాసంగం(జహీరాబాద్): సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె కొనసాగుతోంది. మంగళవారం ఝరాసంగంలో జేపీఎస్లు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఘనంగా ఆంజనేయస్వామి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామంలో ఆంజనేయస్వామి పునఃప్రతిష్టాపన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గణపతిపూజ, ఆవాహిక పూజ, మండపారాధన నూతన విగ్రహాలకు జలాధివాసం, గణపతి సుబ్రహ్మణ్య స్వామి ఆంజనేయస్వామిలకు అభిషేకం మహామంగళహారతి, యజ్ఞం నిర్వహించారు.

## సంక్షిప్త వార్తలు

**◆ అకాల వర్షాలతో ఇబ్బందులు**

జిన్నారం(పటాన్‌చెరు): అకాల వర్షాలు కురుస్తుండటంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని గుమ్మడిదల, జిన్నారం, సోలక్‌పల్లి, అనంతారం, నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి వివిధ పంటలను దెబ్బతిన్నాయి. అకాల వర్షాలు కురుస్తున్న సమయంలో పంటలు నష్టపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని గుమ్మడిదల ఏఓ శ్రీనివాస్‌రావు తెలిపారు.

**◆ మిర్చి పంట పరిశీలన**



జిన్నారం(పటాన్‌చెరు): వరంగల్ జిల్లా ములుగు నియోజకవర్గంలోని నల్లవల్లి గ్రామంలో బాడియా రకం మిర్చిని కొంతమంది రైతులు సాగు చేస్తుండటంతో గుమ్మడిదల గ్రామానికి చెందిన రైతులు పంట సాగును తెలుసుకునేందుకు మంగళవారం వెళ్లారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బాడియా రకం మిర్చి క్వింటాలుకు రూ.80వేలు పలుకుతుందన్నారు. గుమ్మడిదల మండలంలో ఈ పంటను సాగుచేసేందుకు అనువుగా ఉంటుందా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు నల్లవల్లి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పంటను పరిశీలించామని తెలిపారు. నల్లవల్లి గ్రామ రైతులు, అధికారుల సూచనలు, సలహాలతో మర్చి పంటను సాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

**◆ అభాగ్యులకు ఆపన్నహస్తం**



నారాయణఖేడ్: కేంద్ర ఆహార సంస్థ డైరెక్టర్, విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేయిర్ ట్రస్ట్ చైర్మన్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ నారాయణఖేడ్ ప్రాంతంలోని పలువురు అభాగ్యులకు ఆపన్నహస్తం అందించారు. మంగళవారం ఇందిరానగర్ కాలనీకి చెందిన లక్ష్మణ్ వారం క్రితం గుండెపోటుతో మృతి చెందగా కుటుంబీకులను పరామర్శించి రూ.5వేల నగదుతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. అదేవిధంగా ఖేడ్‌కు చెందిన రాములు కొద్దిరోజులుగా పక్షవాతంతో బాధపడుతుండగా కుటుంబపోషణ భారంగా మారడంతో కుటుంబీకులకు నిత్యావర సరుకులు అందజేశారు. జుజాల్‌పూర్ గ్రామంలో ఖాజాసాబ్, నాగవ్వ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు శంకర్‌గౌడ్, ముస్వర్ ఖురేషి, సాయిలు, కృష్ణమూర్తి, మణికంఠ, లోకేష్‌గౌడ్, కృష్ణాగౌడ్ పాల్గొన్నారు.

**◆ రోడ్డుకు మరమ్మతులు**



నారాయణఖేడ్: పట్టణంలో గుంతలు పడిన బైపాస్ రోడ్డుకు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన ఆకాల వర్షాలతో గుంతలమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్ ఆధ్వర్యంలో డోజర్ సహాయంతో చిప్స్ కంకర వేసి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. దత్తాత్రేయ కాలనీలో దెబ్బతిన్న రోడ్లను వైస్‌చైర్మన్ అహీర్ పరశురాం పరిశీలించి కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

**◆ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం**

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డిపల్లి కాలనీలో కార్మికశాఖ ఆధ్వర్యంలో కార్మికులకు మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్లు కార్మికులకు వివిధ వైద్య పరీక్షలు చేశారు.

**◆ అన్ని మతాల సారాంశం ఒక్కటే**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అన్ని మతాల సారాంశం ఒక్కటేనని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం భారతీనగర్ డివిజన్ ఎల్ఐజీ కాలనీలో ఫెయిత్ టెంపుల్ చర్చిలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చర్చిల నిర్మాణానికి, క్రైస్తవుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. క్రైస్తవుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అదర్శ్‌రెడ్డి, షుగేష్, పరమేష్ యాదవ్, పృథ్వీరాజ్, పాస్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.




**◆ ఎంఐజీ కాలనీలో ముఖాముఖి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో మంగళవారం ఎంఐజీకాలనీలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

**◆ 16వ రోజుకు వీఓఏల సమ్మె**

జహీరాబాద్ టౌన్: సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఓఏలు చేస్తున్న సమ్మె మంగళవారానికి 16వ రోజుకు చేరుకుంది. సమ్మెలో వీఓఏల సంఘం నాయకులు అన్నపూర్ణ, అనుసమ్మ, అశోక్‌కుమార్, రాజ్‌కుమార్, మల్లేశం, రేణుక, అనిత, శశికళ, మాజీద్ పాల్గొన్నారు.

**◆ అంత్యక్రియలకు ఆర్థికసాయం**

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని దోమడుగు గ్రామానికి చెందిన మంగమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. అంత్యక్రియలకు బీఆర్ఎస్ నేత గూడెం మధుసూధన్‌రెడ్డి రూ.10వేల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన నగదును స్థానిక సర్పంచ్ మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.